# చాపకింద నీరు

జె. శ్యామల

***"మే**డిన్ ఇండియా ప్యారా సోనియా" హమ్ చేస్తున్న జ్యోత్స్న కేసి ఓ సారి చూసింది మౌక్తిక. చేతికి ఇంపోర్టెడ్ వాచ్, ఫారిన్ నెయిల్ పాలిష్, ఫారిన్ లిప్‌స్టిక్, చివరాఖరుకు ఫారిన్ స్ప్రే.. కిసుక్కున నవ్వింది మౌక్తిక.*

*బ్యాగ్ భుజానికి తగిలించుకోబోతున్న జ్యోత్స్న, మౌక్తికకేసి చురుగ్గా చూసి "నీనవ్వుకేమిటర్థం?" అడిగింది.*

"నీ పాటకు, నీకూ ఉన్న దగ్గరి సంబంధం" అంది మౌక్తిక 'దగ్గరి'ని జాగ్రత్తగా వత్తి పలుకుతూ.

"ఓ అదా. భలేదానివే. ఏదో ట్యూన్ బాగుందని పాడుకున్నంత మాత్రాన" అంటూ మళ్ళీ అద్దంలోకి చూపు సారించింది జ్యోత్స్న.

"చాల్లే పదవోయ్. మనం వెళ్తోంది వసూ ఇంటికే కదా. అంత ముస్తాబు అవసరమా?" అంది మౌక్తిక అసహనంగా.

" పిచ్చీ! వెళ్ళేది ఎక్కడికయినా ఎవర్ క్వీన్‌గా ఉండాలి. అది నా పాలసీ" అంది జ్యోత్స్న కదులుతూ.

ఏమయితేనేం మేకప్‌కు ఫుల్‌స్టాప్ పెట్టిందన్న ఆనందంతో మౌక్తిక ఇక వాదించలేదు. ఇద్దరూ కలిసి హాస్టల్ బయటకొచ్చారు.

ఆటో కనిపించింది. "వెస్ట్ మారేడ్‌పల్లి" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

ఆటో అతను ఎక్కండన్నట్లు తల ఊపి మీటరు వేశాడు.

మౌక్తిక, జ్యోత్స్న, వాసవి కాలేజ్ రోజుల్నుంచీ స్నేహితులు. పి.జి.పరీక్షల ముందరే వాసవి పెళ్ళి జరిగిపోయింది. జ్యోత్స్న ఓ ప్రైవేట్ ఫర్మ్‌లో పనిచేస్తోంది. మౌక్తిక మాత్రం రీసెర్చ్ పేరుతో ఇంకా చదువు లోకంలోనే ఉంది. "నీ సెర్చ్ ఈ జన్మకు పూర్తికాదులే" అంటూ జ్యోత్స్న అడపాతడపా ఏడిపిస్తుంటుంది.

"ఆ.. యిటు..రైట్..ఊ..మళ్ళీ లెఫ్ట్. అదుగో ఆ నల్లగేటు ఇల్లు" జ్యోత్స్న మాటలతో ఉలిక్కిపడి "అరే! వచ్చేశామే" అంద మౌక్తిక

"నువ్వు ఆలోచనలో పడ్డావంటే మారేడుపల్లేం ఖర్మ, మెల్‌బోర్న్ కూడా వచ్చేస్తుంది" సరదాగా విసుక్కుంది జ్యోత్స్న.

మౌక్తిక ఆటో అతనికి డబ్బులిచ్చి పంపుతుండగా, జ్యోత్స్న ముందుకెళ్ళి డోర్‌బెల్ నొక్కింది. అది వినసొంపైన సంగీతం పలికింది.

మరుక్షణం తలుపులు తెరుచుకున్నాయి. జ్యోత్స్న, మౌక్తిక ఆత్రంగా చూశారు. పనిమనిషి వచ్చి గేటు తీస్తూ "రండమ్మా! అమ్మగారు లోపలున్నారు" అంది.

"ఈ వసూకస్సలు బుద్ధిలేదు. దోస్తులం ఇంతదూరం పడివస్తే "అలవైకుంఠపురంబులో, నగరులో, ఆ మూల సౌధంబు... అన్న లెవెల్లో ఎక్కడో తాపీగా కూర్చుంటుందా?" జ్యోత్స్న ఆగ్రహం ప్రకటించింది.



మౌక్తికకు కూడా కోపం వచ్చినా సర్దుకుంటూ "ఇదివరకటి వసూ యేమిటి పరుగెట్టుకుంటూ రావడానికి. పాప పనిలో బిజీగా ఉందేమో"అంది.

హాల్లోకి అడుగు పెట్టగానే కుడివైపు గదిలోంచి "హాయ్ రండే. మీకోసమే ఎదురుచూస్తున్నా" అంది వాసవి.

"ఏదీ, ఇక్కడ కూర్చునే ఎదురుచూడటం" కోపంగా అడిగింది జ్యోత్స్న.

"బి కూల్. ఇదుగో మా గోల్డీని రెడీ చేస్తున్నా" అంది వాసవి. ముద్దుగా ఉన్న పాపను చూడగానే కోపం మాట మరిచిపోయారు.

"ఏం పేరు పెట్టారు వసూ" అడిగింది మౌక్తిక.

"తుషార. ముద్దు పేరేమో గోల్డీ" చెప్పింది వాసవి.

"తుషార శీతల సరోవరాన" పాట మదిలో మెదిలి "పేరు బాగుందోయ్" మెచ్చుకుంది మౌక్తిక.

"సెలెక్షన్ మన్దే మరి, ఒక్క క్షణం" అంటూ "సుశీలా!" అంటూ కేకేసింది.

సుశీల ఆ వెంటనే బర్గర్, పేస్ట్రీలు పట్టుకొచ్చింది. పిలుపులోనే ఆదేశాన్ని అర్థం చేసుకున్న సుశీలను చూసి మనసులోనే "మంచి తర్ఫీదు" అనుకుంది మౌక్తిక.

"ఇదుగో మా గోల్డీ కోసం మా అక్క న్యూయార్క్ నుంచి ఇవన్నీ పంపింది" అంటూ వాసవి చూపించింది. డ్రెస్‌లు, బొమ్మలు, మందులు.. బెడ్‌షీట్లు, డైపర్లు వగైరా..వగైరా.. చుట్టూ కనిపించాయి.

వాసవికేసి పరిశీలనగా చూసింది మౌక్తిక. వాసవి పేరుకే భారతీయ నివాసి, చూడబోతే అపాదమస్తకం అమెరికా వస్తు వినియోగి.

జ్యోత్స్న ఉత్సాహంగా "యు ఆర్ సో లక్కీ వసూ. అమెరికన్ గూడ్స్ నందించే అక్క ఉంది. అబ్బ! ఈ నెయిల్ పాలిష్ కలర్స్, షేడ్స్ చూడు ఎంత బాగున్నాయో. మీ అక్కకు ఎంత ఓపికోయ్ ఇవన్నీ పంపటానికి" అంది.

"ఆమాట నిజం. ఎవరు వస్తున్నా మా కోసం ఏవేవో పంపుతుంది. షాంపూలు, సబ్బులు, పౌడర్ల దగ్గర్నుంచీ. నాకసలు ఇక్కడివి కొనే పనే ఉండదు" కాస్తంత గర్వంగా చెప్పింది వాసవి.

డిజిటల్ డైరీలు, పెన్నులు, వాక్‌మన్ అన్నీ జ్యోత్స్నను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

"నువ్వుమాత్రం ఏంమారలేదే" అంది వాసవి మౌక్తికను చూస్తూ.

"అలా అనకు. ఆరుకిలోలు పెరిగా" అంది మౌక్తిక నవ్వు దాచుకుంటూ.

"గొప్పమార్పు" అంది వాసవి నవ్వుతూ. జ్యోత్స్న శృతి కలిపింది.

కాఫీలు తెచ్చింది సుశీల.

"మీ అత్తగారు కనిపించరేం" అడిగింది మౌక్తిక కాఫీ సిప్‌చేస్తూ.

"ఉంది. ఆమెకు టీ.వి.క్రేజ్ ఎక్కువలే. అందుకే ఆమె రూమ్‌లోనే సపరేట్‌గా టీ.వి. ఏర్పాటుచేశాం" అంది గొప్పగా వాసవి.

"అవునూ, అత్తగారంటే సాధించటం..అవీ లేవా?" గొంతు తగ్గించి అడిగింది జ్యోత్స్న.

"కొత్తల్లో కొంచెం సణిగేది. అక్క పంపించే వస్తువుల పుణ్యమా అని నాకా బాధపోయింది" నవ్వింది వాసవి.

"ఓహో" అంది జ్యోత్స్న. "కిటుకు అదా" అన్నట్లు.

"అమెరికా వస్తువులు అత్తగార్లను ఐస్ చేస్తున్నాయన్నమాట" మనసులోనే అనుకుని, నవ్వుకుంది మౌక్తిక.

"మరి మీరు అమెరికా వెళ్ళే ప్రయత్నమేం చేయలేదా" అడిగింది మౌక్తిక.

"ఎందుకు చేయలేదూ, ప్రయత్నం ఫలించే టైమ్‌కు డబ్ల్యు.టి.సి.మీద అటాక్ జరిగింది. మా ప్లాన్ తల్లకిందులైంది. మా ఆయన ఏకైక పుత్రరత్నం కదా. మా అత్తగారేమో ఇప్పుడు వెళ్ళొద్దని గొడవ. చూద్దాం. వచ్చే యేటికెలా ఉంటుందో" అంది వాసవి.

"ఆల్ ది బెస్ట్. నువ్వు వెళితే మాత్రం ఈ ఎవర్ క్వీన్ జ్యోత్స్నను మర్చిపోకుండా కాస్మొటిక్స్ వగైరా పంపిస్తావు కదూ" ఆశగా అంది జ్యోత్స్న.

మౌక్తిక అందుకుని "ఆలులేదు, చూలు లేదు" అంటుంటే వాసవి "ష్యూర్. నువ్వు అడగాలా" అంది.

కాసేపు తుషారతో ఆడుకున్నారిద్దరూ. కళ్ళలోకి చూస్తూ, బోసినవ్వులు నవ్వుతోంది పాప.

అక్కడి వస్తువులు చూశాక తాము తెచ్చిన నిర్మల్ బొమ్మల్ని ఇవ్వడానికి ఇబ్బందిగా అనిపించింది మౌక్తికకు. అయినా తప్పదుకదా అని "ఇవి గోల్డీ కోసం" అంటూ అందించింది.

వాసవి వాటిని నిరాసక్తంగా అందుకుని "థ్యాంక్యూ" అంది.

"ఇక వస్తాం. చాలా టైమయింది" అంటూ లేచారు.

ఫారిన్ చాక్లెట్లను, రెండు చిన్న స్ప్రే బాటిల్స్‌ను అందించింది వాసవి.

జ్యోత్స్న ముఖం వెంటనే వెలిగింది.

"థ్యాంక్యూ, థ్యాంక్యూ వసూ" అంది. మౌక్తిక కూడా థ్యాంక్స్ చెప్పింది.

ఇద్దరూ బయటకు వచ్చారు. "ఇదుగో ఈ స్ప్రే కూడా నువ్వే వాడుకో, నీకిష్టం కదా" అంది మౌక్తిక.

"విత్‌ప్లెజర్.నువ్వు స్ప్రే వాడవుకదూ. ఐ పిటీయూ" అంది జ్యోత్స్న.

"నీ పిటీని ఇలాటి అనవసర విషయాలకు వాడకు" అంది మౌక్తిక కాస్తంత కోపంగా.

"ఓ.కె.,ఓ.కె."అంది ఆ బాటిల్‌ను మురిపెంగా చూసుకుంటూ జ్యోత్స్న.

మౌక్తిక తమ యింటి దగ్గర దిగిపోయింది. జ్యోత్స్న హాస్టల్‌కు వెళ్ళింది.

*****

ఆరోజు ఆదివారం. మౌక్తిక తన దగ్గరే ఉన్న అత్తకూతురు మల్లికతో కలిసి యూసఫ్‌గూడలో ఉన్న భోగేశ్వర రావు గారింటికి వెళ్ళారు. మౌక్తిక వాళ్ళకు ఆయన దూరపు చుట్టం.వెళ్ళేసరికి భోగేశ్వరరావు దంపతులు హాల్లోనే ఉన్నారు. ఇంటికొచ్చిన అతిధులు కాబోలు ఓ యిద్దరు సోఫాలో ఆసీనులై ఉన్నారు.

మౌక్తికా వాళ్ళను చూడగానే భోగేశ్వరరావు భార్య శోభ "రండి,రండి" అని లోపలికి ఆహ్వానించి, "కొంచెంసేపు మా పావనితో మాట్లాడుతూ ఉండండి" అంటూ "పావనీ" అని కేకేసింది.

పావని లోపల్నుంచి వచ్చి "మౌక్తికా వాళ్ళని చూసి "హాయ్! రండి, ఇక్కడ కూర్చుందాం" అంది.

ఓ అందమైన ప్లేట్లో స్నాక్స్ తెచ్చి ముందరపెట్టింది పావని. అవి తింటూ పావనితో ఒకటీ, అరా మాట్లాడుతున్నారు మౌక్తిక, మల్లిక.

అప్రయత్నంగా హాల్లో మాటలు చెవుల్లోకి చొచ్చుకుపోతున్నయ్. "ఇదుగో ఈ పేస్ట్ చూడండి. కాస్తంటే కాస్త గురుగ్గింజంత బ్రష్ మీద వేసుకుంటే చాలు. మీ పళ్ళు ముత్యాల్లా తళుక్కుమంటాయి. ఈ మాయిశ్చరైజర్ పూసుకు చూడండి. ఎంత మృదువుగా ఉంటుందో. టాయిలెట్ సోప్స్, కాస్మొటిక్స్, క్లీనర్స్ ఒకటేమిటి అన్నీ ఫస్ట్ క్వాలిటీవి." భోగేశ్వర రావు దంపతులు మంచి అనుభవమున్న అమ్మకందారుల్లా వివరిస్తున్నారు.

"ఏమిటీ ఏదైనా కొత్త బిజినెస్సా?" పావనిని అడిగింది మౌక్తిక.

"అలాటిదేలే, స్మార్ట్‌వే అని ఓ ఫారిన్ కంపెనీ ఉంది. ఓ మూడువేలు కట్టి మెంబరుగా చేరితే మనక్కావలసిన వస్తువులు తీసుకోవచ్చు. మనం నెలనెలా వస్తువుల్ని కొనుక్కోవడంతో పాటు, కనీసం నెలకొకరిని మెంబరుగా చేర్చాలి" ఆగింది పావని.

"చేరిస్తే?" ఏమవుతుందన్నట్లు అడిగింది మౌక్తిక.

మన పనితీరును బట్టి పర్సంటేజ్ ప్రకారం ఆ కంపెనీ తమ లాభాల్లో మనకూ వాటా పంపుతుంది. అంటే మనం కూర్చునే డబ్బు గడించవచ్చన్న మాట. పెట్టుబడి లేకుండా ఆదాయం బాగుందికదూ. అదుగో మమ్మీ, డాడీ ఆ పనిలోనే ఉన్నారు. కొంచెం సేపుంటే మీకూ చెబుతారు" అంది పావని.

"అయితే మనదేశంలో తయారయ్యే వస్తువుల మాటేమిటి" అడిగింది మౌక్తిక.

అప్రయత్నంగా హాల్లో మాటలు చెవుల్లోకి చొచ్చుకుపోతున్నయ్. "ఇదుగో ఈ పేస్ట్ చూడండి. కాస్తంటే కాస్త గురుగ్గింజంత బ్రష్ మీద వేసుకుంటే చాలు. మీ పళ్ళు ముత్యాల్లా తళుక్కుమంటాయి. ఈ మాయిశ్చరైజర్ పూసుకు చూడండి. ఎంత మృదువుగా ఉంటుందో. టాయిలెట్ సోప్స్, కాస్మొటిక్స్, క్లీనర్స్ ఒకటేమిటి అన్నీ ఫస్ట్ క్వాలిటీవి" భోగేశ్వర రావు దంపతులు మంచి అనుభవమున్న అమ్మకందారుల్లా వివరిస్తున్నారు.



"భలేదానివే. ఇప్పుడు మాత్రం కర్సన్ అండ్ కర్సన్ కంపెనీ, థండర్ అండర్ వండర్" కంపెనీల ప్రొడక్ట్‌లే కదా ఎక్కువమంది వాడుతోంది" అంది పావని.

ఓ క్షణం అదీ నిజమేననిపించింది మౌక్తికకు.

మనసులో ఆలోచన రాజుకోవటం మొదలయింది. ముందు అక్కడ్నుంచి బయటపడాలనిపించింది.

"పావనీ! మేమింక వస్తాం" అంది లేస్తూ మౌక్తిక.

"అప్పుడే, ఇంకా మమ్మీ, డాడీ మాట్లాడనే లేదు" అంది పావని.

"మల్లికకి రేపు టెస్ట్ ఉంది. చేంజ్ కోసం వచ్చామంతే" అని ముందుకు నడిచింది మౌక్తిక. మల్లిక అనుసరించింది.

బయల్దేరుతున్న వాళ్ళని చూసి "అరె. అప్పుడే వెళ్తారా? నేనింకా స్మార్ట్‌వే గురించి మీకు చెప్పనేలేదు" అంది శోభ.

"పావని చెప్పింది ఆంటీ" అంది మౌక్తిక.

"ఉహూ, లాభంలేదోయ్. మౌక్తిక ముక్తసరి అమ్మాయి. టాకెటివ్ కాదు" అన్నాడు భోగేశ్వరరావు.

"పోన్లే. నీకు తెలిసి ఇంటరెస్ట్ ఉన్న వాళ్ళుంటే మా దగ్గరికి పంపించేం" అంది శోభ.

తలాడించి బయటకు నడిచింది.

మనసులో ఆలోచనకు స్పష్టత వస్తుండగా "ఇంట్లో నిత్యం వాడే వస్తువులే కదా. తీసుకుంటే యేం. పైగా ఓసారి కొనుక్కుంటే చాలాకాలం సరిపోతాయట. ఆదాయానికి ఆదాయం, వస్తువులకు వస్తువులు" మల్లిక అంది.

ఇంతలో ఆటో కనిపించింది. "హిమాయత్‌నగర్" చెప్పి ఎక్కారిద్దరూ.

"మల్లికా! నువ్వూ అలా మాట్లాడితే ఎలా? ఆదాయం వస్తుందన్న ఆశతో, సంభాషణా చాతుర్యంతో ఆ ఫారిన్ కంపెనీకి మార్కెట్ పెంచేసి, ఆ కంపెనీ ఇక్కడ వేళ్ళూనుకొనేలా చేయడం సబబేనా? ఈ గొలుసు ఇలా అల్లుకుపోయి మన వ్యవస్థకే ఉచ్చుగా మారే ప్రమాదం ఉంది. కేవలం వ్యక్తిగతంగా ఆలోచించి మనకేం అనుకోవటం పొరపాటు. ఆనాడు గాంధీజీ విదేశీ వస్తు బహిష్కరణ చేసి, దేశీయతకు ప్రాణంపోసి స్వాతంత్ర్యం తెచ్చారు. స్వతంత్ర భారతంలో ఇప్పుడు విదేశీ వస్తు వ్యామోహంతో మనం ఐడెంటిటీనే కోల్పోతున్నాం. ఈ గ్లోబలైజేషన్ ప్రవాహంలో కొట్టుకుపోతే మనం మునిగిపోక తప్పదు. మనం ఇదేస్థాయిలో మన వస్తువుల్ని ఇతర దేశాల్లో అమ్మే సీన్ మనకుందా. ఇక్కడిక్కడే దళారీల చేతుల్లో మోసపోతున్న మన ఉత్పత్తిదారులు విదేశాల్లో ఏం నెగ్గుకు రాగలరు? అయినా మేడ్ ఇన్ ఇండియా వస్తువులంటే తీసి పడేసే మ్యాడ్ ఇన్ ఇండియా పెరిగిపోతుంటే వేరే ఎవరో ఎందుకు ఆదరిస్తారు?" ఆవేశంగా అంది మౌక్తిక.

"సరే ఒప్పుకున్నా. నీలాగా ఒకరిద్దరు గిరిగీసుక్కూర్చుంటే ఇదంతా మారిపోతుందా" మల్లిక అడిగింది.

"నిజమే. కానీ తెలిసీ నేనూ అలాగే నడవలేను. నిలబెట్టలేకపోయినా పడగొట్టలేను" అంది మౌక్తిక.

మౌక్తికకు ఆ క్షణంలో ఫారెన్ వస్తువులంటే మనసుపడే జ్యోత్స్న, వాసవి గుర్తొచ్చారు. అక్కడి వస్తువులు ఎవరో కానుకగా ఇస్తే వాడుకొంటున్నారు. అలాటివాళ్ళు మహా అయితే ఓ మూడుశాతం ఉండొచ్చు. కానీ ఇలా కంపెనీలు, సభ్యత్వం, నెట్‌వర్క్..ఇదంతా ఎక్కడికి దారి తీస్తుంది?

"ఇల్లొచ్చేసింది దిగు" మల్లిక మాటతో మౌక్తిక ఆలోచనకు బ్రేక్‌పడింది.

*****

పడుకుంటే ఏవేవో ఆలోచనలు. భోగేశ్వరరావుగారు ఉన్నత విద్యావంతుడు. సూక్ష్మగ్రాహి. ఆవకాయ నుంచి అంతర్జాతీయం వరకు అన్ని విషయాల్లో మంచి ఆకళింపు ఉన్నవాడు. మరి? "సిరిరా మోకాలడ్డటం అవివేకం" అనుకున్నాడేమో. స్మార్ట్‌వే వ్యాపార ఎత్తుగడ ఔరా! కాస్తంత డబ్బు ఆశ చూపించి శాశ్వతంగా కస్టమర్లను కట్టిపడేసి, అనంతంగా లాభాలనార్జించే పాచికలు బాగానే వేసింది. మన బోళాతనం అందులో బోర్లా పడటంలో వింతేముంది? ఆలోచన...అలసట...

*****

ఏమిటది? వాళ్ళంతా ఎవరు? ఆ c దొరలు. ఎందరో రాబర్ట్ క్లైవ్‌లు. ఎన్నో విదేశీకంపెనీలు. దేశం అమీర్‌కా గులాం అయింది. మిష్టర్ హుష్ రూలింగ్‌లో భారతీయులంతా రెక్కలు విరిగిన విహంగాల్లా. అంతటా హింస,...దౌర్జన్యం,.. దోపిడీ..

ఉనికిని కోల్పోయి, ఊపిరి సన్నగిల్లి...

"భారత అభాగ్యవిధాత" ఎవరివో వెక్కిళ్ళు.

అంతలో నిలువెత్తు వెలుగులా మరో గాంధీ నడచివచ్చాడు.

మళ్ళీ స్వాతంత్ర్య సమరోత్సాహం. అంతటా 'స్వతంత్ర భారత్‌కీ జై బోలో' నినాదాలు.

'జైజై' కీచుగా అరిచింది మౌక్తిక.

"ఎయ్ మౌక్తికా! ఏంటి అరుస్తున్నావ్? ఏమయింది" గట్టిగా కుదుపుతూ అడుగుతోంది మల్లిక.

కళ్ళు తెరిచిన మౌక్తిక కళ్ళనిండా 'కల 'వరం. జీరపోయిన గొంతుతో అస్పష్టంగా అంది "నాదేశం, నాదేశం!?" ●

